క్లుప్తంగా

ఏసీ, వాటర్ కూలర్ వితరణ



కంకిపాడు: దాతల సాయంతో ఉప్పలూరు పీహెచ్‌సీలో వసతులు సమకూరుతున్నాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. నెరుసు వెంకటేశ్వరరావు, వీర ప్రతాప్ ఆసుపత్రి వార్డుకు ఏసీని, రైతు విభాగం నేత అన్నే ధనయ్య వాటర్ కూలర్‌ను శనివారం వితరణగా అందించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అంజు, పీహెచ్‌సీ మాజీ చైర్మన్ పడవల మధుసూదన్‌రావు, స్థానికులు చలసాని రాధాకృష్ణమూర్తి, కొండవీటి శివయ్య, కనగాల సుబ్బారావు, తాతా వెంకటేశ్వరరావు, లాం సురేష్, ఎంపీహెచ్ఈఓ కృష్ణారావు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తి పన్నులు వెంటనే చెల్లించాలి



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో బకాయి ఉన్న ఆస్తి పన్నులను ప్రజలు వెంటనే చెల్లించాలని కమిషనర్ పీ భవానిప్రసాద్ పేర్కొన్నారు. కానూరు మురళీనగర్‌లో శనివారం ఆయన పర్యటించి ఆస్తి పన్నుల బకాయి ఉన్న భవనాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఆస్తి పన్ను బకాయి ఉన్న వారికి రెడ్ నోటీసులు ఇచ్చామని తెలిపారు. సకాలంలో ఆస్తి పన్నులు చెల్లించని పక్షంలో మున్సిపాలిటీ చట్టం-1965 ప్రకారం ఆస్తులు జప్తు చేస్తామన్నారు. ఆస్తి, నీటి పన్నులు బకాయి చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు.

29న మండల పరిషత్ సమావేశం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కే జోగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మహాత్మాగాంధీ నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యర్రగొర్ల నగేష్ అధ్యక్షతన ఉదయం 10 గంటలకు సభా మందిరంలో సమావేశం జరుగుతుందని చెప్పారు. వ్యవసాయం, పశుపోషణ, విద్య, వైద్యం, గ్రామీణ నీటి సరఫరా, ఎన్ఆర్ఈజీఎస్, రెవిన్యూ తదితర శాఖలపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీవో సూచించారు.

ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: తెలుగు కళావాహిని, కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు సాహితీ సమితి, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. ఒంగోలుకు చెందిన గాయనీ గాయకులు తాళ్లూరి శ్రీదేవి, అంజిబాబు, అంజుస్వామి, తాళ్లూరి రవి, గోవిందరవి, రాజు, స్వామి, చరణ్ రాజ్ తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు గోళ్ల నారాయణరావు, చింతకాయల చిట్టిబాబు, బోడి ఆంజనేయరాజు, కే డేవిడ్‌రాజు, శింగంశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

వసంత నవరాత్రోత్సవాల్లో విశేష పుష్పార్చనలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఈ నెల 30వ తేదీ నుంచి ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో వసంత నవరాత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఈనెల 30వ తేదీ నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు జరిగే నవరాత్రోత్సవాల్లో అమ్మవారికి ప్రతి నిత్యం విశేష పుష్పార్చన నిర్వహించేందుకు వైదిక కమిటీ నిర్ణయించింది. ప్రతి రోజు ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీగణపతి విగ్రహం వద్ద అమ్మవారి ఉత్సవ మూర్తికి పుష్పార్చన జరుగుతుంది. విశేష పుష్పార్చనలో పాల్గొనే ఉభయదాతలు రూ. 2,500 టికెటు కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

ఏ రోజు ఏ పుష్పాలంటే...!

ఈనెల 30వ తేదీ ఆదివారం మల్లెపూలు, మరువం, 31వ తేదీ సోమవారం కనకాంబరాలు, గులాబీలు, ఏప్రిల్ 1వ తేదీ మంగళవారం చామంతి, ఇతర పూలు, 2వ తేదీ బుధవారం మందార పూలు, ఎర్రకలువలు, 3వ తేదీ గురువారం తెల్ల జిల్లేడు, మారేడు, తులసీ, మరువం, ధవళం, 4వ తేదీ శుక్రవారం కాగడా మల్లెలు, జాజులు, మరువం, 5వ తేదీ శనివారం ఎర్ర తామరపూలు, ఎర్ర గన్నేరు, సన్నజాజులు, 6వ తేదీ ఆదివారం చామంతి, సంపంగిపూలు, 7వ తేదీ సోమవారం కనకాంబరాలు, గులాబీలతో అర్చన నిర్వహిస్తారు. విశేష పుష్పార్చన అనంతరం అమ్మవారికి సమర్పించిన పుష్పాలను భక్తులకు పంపిణీ చేస్తారు.

ప్రజలపై పన్ను భారం

- ఆస్తి పన్ను చెల్లించని వారికి రెడ్ నోటీస్
- మౌలిక వసతులు కట్
- ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరిక



తాడిగడప మున్సిపాలిటీ కార్యాలయం

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో ఆస్తి పన్నులు చెల్లించని వారిపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇప్పటికే ఆస్తి పన్నులు బకాయిపడి చెల్లించని యజమానులు స్పందించకపోవడంతో వారికి రెడ్ నోటీసులు జారీ చేయడానికి మున్సిపాలిటీ అధికారులు రంగం సిద్ధం చేశారు. పైగా ప్రజల ఆస్తులు చట్ట ప్రకారం జప్తు చేస్తామని హుకుం జారీ చేస్తున్నారు. ఒక పక్క ఆస్తి పన్ను మరోపక్క నీటి పన్ను భారంతో మున్సిపాలిటీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. తాడిగడప మున్సిపాలిటీలో అధికారుల లెక్కల ప్రకారం 46,958 అసెస్‌మెంట్లు (నివాసాలు) ఉన్నాయి. ఇవి కాకుండా అసెస్‌మెంట్లు లేని నివాసాలను కూడా ఇటీవల అధికారులు సర్వేలో గుర్తించారు. ఆస్తి పన్నులు చెల్లించాల్సిన వారు పన్నులు చెల్లించకపోవడంతో బకాయి రూ. 7.20 కోట్లు ఉంది. తాడిగడప మున్సిపాలిటీ అయిన తర్వాత ప్రధానంగా ఆస్తి పన్నులు భారీగా పెంచడం, పన్నులు చెల్లించడంలో జాప్యం జరిగితే భారీ జరిమానాలు వేయడంతో అసలు పన్నుల కన్నా జరిమానాలు తడిచి మోపెడవుతున్నాయి. దీంతో ఆర్థిక భారంతో ఉన్న వారి పన్నుల చెల్లింపు మొండి బకాయిలుగా మారాయి.

రెడ్ నోటీసులు జారీ

తాడిగడప మున్సిపాలిటీలో ఆస్తి పన్నులు బకాయి ఉన్న వారికి అధికారులు రెడ్ నోటీసులు జారీ చేశారు. నోటీసులు తీసుకున్న వారు వెంటనే ఆస్తి పన్నులు జరిమానాలతో సహా చెల్లించాల్సి ఉంటుంది. అలా ఆస్తి పన్నులు చెల్లించకపోతే వారికి ఎసెన్షియల్ సర్వీసెస్ డిస్‌కనెక్షన్(ఈఎస్‌డీ) నోటీసులు ఇస్తారు. ఈ నోటీలు అందుకున్న వారు 48 గంటల్లో ఆస్తి పన్నులు బకాయి చెల్లించకపోతే యజమాని ఇంటికి కుళాయి కనెక్షన్ కట్ చేస్తారు. ఇంటి విద్యుత్ కనెక్షన్ కూడా తొలగించే అవకాశం ఉంటుందని మున్సిపాలిటీ అధికారులు చెబుతున్నారు. అలాగే ఆస్తులను మున్సిపల్ చట్టం-1965 ప్రకారం జప్తు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

ఇదెక్కడి న్యాయం

తాడిగడప మున్సిపాలిటీ అధికారుల వైఖరి పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆస్తి పన్నులకు సంబంధించి డిమాండ్ నోటీసులు మున్సిపాలిటీ సకాలంలో గృహ యజమానులకు ఎందుకు జారీ చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. డిమాండ్ నోటీసులు సకాలంలో జారీ చేయడంలో మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం చూపడం వల్లనే సమస్య ఇక్కడి వరకు వచ్చిందని నివాసితులు ఆరోపిస్తున్నారు. గృహాలకు పన్నులు వేయమంటే లంచాలు అడుగుతున్నారని విమర్శిస్తున్నారు. మున్సిపాలిటీ అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపిస్తున్నారు. నీటి పన్నులు, ఆస్తి పన్నులు ఒకేసారి చెల్లించడం ఆర్థిక భారంగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో జరిమానాలు లేవు

ఆస్తి పన్నుల బకాయిలపై వేసిన జరిమానాలు ప్రభుత్వం తొలగించాలని మున్సిపాలిటీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దాదాపు రూ. 1.50 కోట్లు ఆస్తి పన్నులపై జరిమానాలు వేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో జరిమానాలు లేకుండా పన్నులు కట్టించుకున్నారని, సకాలంలో పన్నులు చెల్లిస్తే ఐదు శాతం రిబేట్ కూడా ఇచ్చారని నివాసితులు తెలుపుతున్నారు. అలాగే నీటి పన్నులపై కూడా ఒత్తిడి చేయలేదంటున్నారు. కూటమి పాలన పుణ్యమా అని నేడు తాడిగడప మున్సిపాలిటీలో పన్నుల మోతతో పెనుభారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలను బెదిరించడం తగదు



తాడిగడప మున్సిపాలిటీకి చెల్లించాల్సిన పన్నుల విషయంలో నివాసితులకు నోటీసులు ఇచ్చి బెదిరించడం తగదు. మున్సిపాలిటీ సిబ్బంది పని తీరు అధ్వానంగా ఉంది. అధికారులు పన్నుల వసూళ్లపైనే కాకుండా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా దృష్టి పెట్టాలి.

– షేక్ కాశిం, సీపీఎం మండల కార్యదర్శి

అర్చకునిపై కక్ష సాధింపు చర్యలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు గ్రామంలోని శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానం అర్చకునిపై టీడీపీ నాయకులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. వంశ పారంపర్యంగా వస్తున్న అర్చకత్వ విధుల నుంచి సస్పెండ్ చేయించారు. గ్రామానికి చెందిన పూజారి అగ్నిహోత్రం మారుతీరావు స్థానిక శ్రీ సీతారామస్వామి ఆలయంలో అర్చకునిగా గత 20 ఏళ్లుగా పని చేస్తున్నాడు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టీడీపీ నేతలు దేవదాయశాఖ ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి గత ఎనిమిది నెలల క్రితం అర్చకుడిని సస్పెండ్ చేయించారు. సాధారణంగా సస్పెండ్ చేసిన ఆరు మాసాలలోపు దేవదాయ శాఖాధికారులు విచారణ పూర్తి చేసి విధుల్లోకి తీసుకోవాలి. లేకుంటే మరొకరిని అర్చకునిగా నియమించాలి. కాని ఇవేవి జరగలేదు. సస్పెండ్ చేసిన ఎనిమిది మాసాల తర్వాత మారుతీరావుపై దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సృజన్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ పీ ప్రియాంక తాజాగా విచారణ చేపట్టారు. ఈ విచారణలో పలువురు మారుతీరావునే అర్చకునిగా కొనసాగించాలని సూచించారు. దీనికి టీడీపీ నాయకులు అంగీకరించకపోవడంతో అధికారులు కూడా మిన్నకుండిపోయారు. కాగా ఈ ఏడాది అర్చకుడు లేకుండా ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలు ఎలా నిర్వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణ



దాడిలో ధ్వంసమైన బడ్డీకొట్టు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడు గ్రామంలో టీడీపీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి ఘర్షణకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామ సర్పంచ్ సర్నాల గంగారత్నం భర్త వార్డు సభ్యుడు సర్నాల బాలాజీ, ఉపసర్పంచ్ గూడవల్లి నరసయ్య రెండు వర్గాలుగా విడిపోయి ఘర్షణ పడ్డారు. వివరాల్లోకి వెళితే.. పంచాయతీ ఆధ్వర్యంలో బల్లెం వారి వీధిలో డ్రెయిన్ల పూడికతీత పనులను శుక్రవారం చేపట్టారు. ఇందులో భాగంగా ఈ వీధిలోని శక్తి రూరల్ వైన్స్‌కు ఆనుకుని డ్రెయిన్‌పై అడ్డుగా ఉన్న బడ్డీకొట్టును కూడా పూడిక తీసేందుకు పక్కకు జరపాలని సూచించారు. దీనికి గూడవల్లి నరసయ్య వర్గానికి చెందిన బడ్డీకొట్టు నిర్వాహకుడు తోటా సుబ్బు అభ్యంతరం చెప్పాడు. బడ్డీ పక్కకు జరిపేది లేదంటూ వాగ్వాదానికి దిగాడు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ భర్త సర్నాల బాలాజీ, ఉపసర్పంచ్ గూడవల్లి నరసయ్య వర్గాలు అక్కడికి చేరుకొని గొడవ పడ్డాయి. ఈ గొడవలో బడ్డీకొట్టును సర్నాల బాలాజీ వర్గం ధ్వంసం చేశారు. కాగా ఈ గొడవపై ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి ఇరు వర్గాలు తీసుకెళ్లి ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు.

పన్నులు తగ్గించకపోతే పోరాటమే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నేతలు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో పెంచిన వివిధ రకాల పన్నులను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని లేని పక్షంలో పోరాటం చేపడతామని సీపీఎం మండల కార్యదర్శి షేక్ కాశిం, సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి తెలిపారు. యనమలకుదురులో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి పన్నులు ఒకేసారి రూ. 4,800 కట్టాలని మున్సిపాలిటీ సిబ్బంది ఇళ్లకు వచ్చి బెదిరించడం తగదన్నారు. ఇంటి పన్నులు మూడింతలు పెంచి ప్రజలపై మోయలేని భారం మోపారని విమర్శించారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్, కమిషనర్ భవానిప్రసాద్ పన్నులు తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పన్నులు పెంచినందుకు నిరసనగా సోమవారం పోరంకిలోని మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఐద్వా మండల కార్యదర్శి పుసులూరి పాతాళలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



ప్రసంగిస్తున్న సైబర్ క్రైమ్ ఎస్ఐ మూర్తి

పెనమలూరు: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పొందాలని సైబర్ క్రైమ్ ఎస్ఐ ఎస్ఆర్‌సీహెచ్ మూర్తి తెలిపారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యాన సైబర్ క్రైమ్‌పై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆధునిక డిజిటల్ యుగంతో నేడు సమాజంలో సైబర్ క్రైమ్‌లు నానాటికి పెరుగుతున్నాయని తెలిపారు. ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ అరెస్టులు, సోషల్ మీడియా దుర్వినియోగం ఇలా అనేక రకాలుగా సైబర్ నేరాలు పెరిగాయని చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటే నేరాలను అరికట్టగలుగుతామని వివరించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త, వ్యర్థాలతో ఇబ్బందులు



పుల్లేరు కాలువ వెంబడి ఉన్న చెత్త, వ్యర్థాలు

కంకిపాడు: చెత్త, వ్యర్థాలు శివారు ప్రాంతంలో పడేయడంతో పాటు, నిత్యం తగులపెట్టడం వల్ల బొడ్డపాడు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై ప్రొద్దుటూరు పంచాయతీ దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, సదరు పంచాయతీపై చర్యలు తీసుకోవాలని బొడ్డపాడు గ్రామ సర్పంచ్, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యదర్శి మూడే శివశంకర్ జిల్లా ఉన్నతాధికారులకు శనివారం ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. ప్రొద్దుటూరు గ్రామ పరిధిలో సేకరించిన చెత్త, వ్యర్థాలను బొడ్డపాడు పరిధిలోని పుల్లేరు కాలువ వెంబడి పారబోస్తున్నారు. అంతేకాకుండా నిత్యం తగలపెట్టడం వల్ల కాలుష్యం పెరిగిపోయి, పొగకు బొడ్డపాడు వాసులు అసౌకర్యానికి గురై, వ్యాధుల బారిన పడుతున్నారు. సమస్యను ఆ గ్రామ సర్పంచ్ మూడే శివశంకర్ ప్రొద్దుటూరు పంచాయతీ దృష్టికి పలు మార్లు తీసుకెళ్లినా పరిష్కారం కాలేదు. దీంతో ఆయన కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి ప్రజారోగ్యానికి భద్రత లేకుండా చేస్తున్న ప్రొద్దుటూరు పంచాయతీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పట్టుదలతో చదివితే మంచి భవిష్యత్



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో ఎమ్మెల్యే యార్లగడ్డ

గన్నవరం: మండలంలోని దావాజీగూడెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం ఉద్యోగ విజయోత్సవం, వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తొలుత ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించిన 42 మంది విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే జీవితంగా అనుకున్న లక్ష్యాలను సాధిస్తారని చెప్పారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో టెక్నికల్ విద్యను అభ్యసించిన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందన్నారు. అనంతరం విద్యతో పాటు క్రీడా, సాంస్కృతిక పోటీల్లో రాణించిన విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ వీవీ కృష్ణమోహన్, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, సర్పంచ్ బడుగు బాలమ్మ, ఎంపీడీఓ టీ స్వర్ణలత, రమేష్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ ప్రతినిధి ఎన్ సురేష్‌బాబు, విద్యుత్ టెక్నాలజీ ప్లాంట్ మేనేజర్ వీ భార్గవ్, పంచాయతీ కార్యదర్శి సరోజిని, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎలీషా దేవసహాయం, హెచ్ఓడీలు బీ మురళీకృష్ణ, ఆర్‌డీ విజయవర్ధన్, ఐవీ రావు, ఏఓ కే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా ఉషారామ వార్షికోత్సవం



టాపర్స్‌కు గోల్డ్‌మెడల్ అందజేసిన విశ్వప్రసాద్, రాంబ్రహ్మం

ఉంగుటూరు: ప్రస్తుత విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు విద్యను అభ్యసించాలని ఒరాకిల్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ కే విశ్వప్రసాద్ అన్నారు. ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల 17వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్వప్రసాద్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు తమ కోర్సుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను పెంపొందించుకోవాలని చెప్పారు. సబ్జెక్టుపై పట్టు సాధించిన వారు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తారని పేర్కొన్నారు. కళాశాల అకాడమిక్‌లో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్, సిల్వర్ మెడల్స్‌తో పాటు మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థులకు రూ.10వేలు క్యాష్ ప్రైజ్ అందించారు. అనంతరం విద్యార్థులు తమ సాంస్కృతిక కార్యక్రమాలతో చూపరులను అలరించారు. కార్యక్రమంలో చైర్మన్ సుంకర రాంబ్రహ్మం, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకేవీ ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం ఈసీ బదిలీ

విజయవాడరూరల్: ఉపాధిహామీ పథకం మండల ఈసీ(ఇంజినీరింగ్ కన్సల్టెంట్)గా పని చేస్తున్న కే శ్రీనివాసరావు బదిలీ అయ్యారు. ఈయనను ప్రభుత్వం రెడ్డిగూడెం మండలానికి బదిలీ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ పీ మురళీకృష్ణప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాసరావు స్థానంలో ఇంకా ఎవరిని నియమించలేదని పేర్కొన్నారు.

13న గురుకులాల ప్రవేశ పరీక్ష

గన్నవరం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి, ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి వచ్చేనెల 13వ తేదీన ఏపీబీఆర్ఏజీ సెట్-2025 ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వై యశోదలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదవ తరగతి, ఇంటర్మీడియేట్ ప్రవేశానికి మొదట వచ్చేనెల 6వ తేదీ ప్రకటించారని, దీనిని 13వ తేదీకి మార్చినట్లు తెలిపారు. ఇతర వివరాలకు 91216 14398 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: మండలంలోని దావాజీగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ, మరమ్మతుల నిమిత్తం ఆదివారం ఉదయం ఏడు నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ గుణదల కార్యనిర్వాహణ ఇంజినీర్ పీ హరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని అల్లాపురం, దావాజీగూడెం, భార్గవినగర్, పామర్తినగర్, రాజీవ్‌నగర్, ఎస్టీబీఎల్ కాలనీ, విద్యానగర్, ఆర్టీసీ బస్‌స్టాండ్ ఏరియా, శ్రీనగర్‌కాలనీ, మల్లికార్జున స్కూల్ రోడ్డు, సుబ్బారావునగర్, బుద్ధవరం రోడ్డు, గొడపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

పెనమలూరు: కానూరులో వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేసి నలుగురు వ్యక్తులపై శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు ఎస్ఐ కే రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు జమదగ్ని వీధిలోని విజయలక్ష్మి నివాసంలో వ్యభిచారం జరుగుతుందన్న సమాచారం మేరకు సీఐ వెంకటరమణ, సిబ్బంది వ్యభిచార గృహంపై దాడి చేశారు. తెనాలికి చెందిన వ్యభిచార గృహ నిర్వహకురాలు పారిచెర్ల జ్యోతి, ఇద్దరు విటులు, ఒక మహిళను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ. 2వేలు సొమ్ము స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

పేకాట ఆడుతున్న 9 మంది అరెస్టు

పెనమలూరు: పోరంకిలో పేకాట ఆడుతున్న తొమ్మిది మంది వ్యక్తులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకిలోని ఒక అపార్టుమెంట్‌లో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారం పోలీసులకు అందింది. దీంతో పోలీసులు అపార్టుమెంట్‌లో తనఖీ చేయగా పేకాట ఆడుతున్న తొమ్మిది మంది వ్యక్తులు పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రూ. 19,980 సొమ్ము స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేశారు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు శిక్షణ

గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి మహిళా పారిశ్రామికవాడ ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు రెండు వారాల పాటు ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా శిక్షణ ఏర్పాటు చేసినట్లు ఎలీప్ అధ్యక్షురాలు కే రమాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 2వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ శిక్షణలో బ్యాంక్ నుంచి వ్యాపార రుణం పొందే విధానం, స్కీంలు, సబ్సిడీలు, చిన్న, మధ్య తరహా పరిశ్రమల నడవడిక, ప్రాజెక్టు రిపోర్టు తయారీ, అమ్మకపు నైపుణ్యాలు, వినియోగదారుల సంబంధాలు, మార్కెటింగ్ నైపుణ్యాలపై అవగాహన కల్పించబడుతుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 94906 84344 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తుకు గడువు పొడిగింపు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బీసీ కార్పొరేషన్ ద్వారా రాయితీపై రుణాలు పొందడానికి ఆన్‌లైన్ దరఖాస్తుల తుది గడువును ఈ నెల 25వ తేది వరకు పొడిగించినట్లు బాపులపాడు ఎంపీడీవో కే జోగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువత స్వయం ఉపాధి పొందేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గరిష్టంగా రూ.5 లక్షల వరకు 50శాతం సబ్సిడీపై బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

ఆధునిక కాలంలో రోబోటిక్స్ ఆవశ్యకత కీలకం

నున్న(విజయవాడరూరల్): ఆధునిక కాలంలో రోబోటిక్స్ ఆవశ్యకత ఎంతో కీలకం కానుందని వోక్స్ వాగన్ సీనియర్ మేనేజర్ రామ్ పేర్కొన్నారు. నున్న గ్రామంలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ రోబోటిక్స్ విభాగం యొక్క ఉపయోగాలు, ఆధునిక కాలంలో రోబోలు ఏ విధంగా పనుల్లో ఉపయోగపడతాయనే అంశంపై విద్యార్థులకు వివరించారు. రానున్న కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోబోటిక్స్‌ను డేటా, లెర్నింగ్ వంటి అవసరాలకు వినియోగించనున్నాయని తెలిపారు. కళాశాల చైర్మన్ ఎస్ సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శ్రీనివాస్, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎస్ గోపాలకృష్ణ, విభాగాధిపతి శేఖర్‌రెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో అభినయ ఆర్ట్స్ కళా బృందానికి చెందిన పలువురు నృత్యకారులు శనివారం కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై చింతా వెంకట సీతారామాంజనేయులు శిష్య బృందం పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చింది. 22 మంది నృత్యకారులు అద్భుతంగా ప్రదర్శించిన కూచిపూడిని భక్తులు ఆసక్తితో వీక్షించారు. అనంతరం కళాకారులను పలువురు భక్తులు అభినందించారు. నృత్యకారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలు అందజేశారు.

దుర్గగుడి వైదిక కమిటీలో మార్పులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థాన వైదిక కమిటీలో మార్పులు చేస్తూ ఆలయ ఈఓ కే రామచంద్రమోహన్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఈ వైదికలో ఆలయ స్థానాచార్య వీ శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు ఎల్ దుర్గాప్రసాద్, వేద పండితులు సీహెచ్ ఆంజనేయ ఘనాపాటి, వీ శ్యావస్య మహర్షి, ప్రధాన అర్చకులు వై మల్లేశ్వర శాస్త్రి, ఉప ప్రధాన అర్చకులు కేఎస్‌వీడీఏం ప్రసాద్‌లను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. వైదిక కమిటీ సభ్యులు దేవస్థానానికి సంబంధించి అన్ని ముఖ్య వైదిక విషయాలు, ముహూర్తాల నిర్ణయంతో పాటు ఆలయ ఈఓకు సూచనలు, సలహాలను అందిస్తుంది.

పోయినది

పావులూరి నాగలక్ష్మి W/o. ఉదయ్‌భాస్కర్, పెదపాడు మండలం, అప్పనవీడు వారికి సంబంధించిన డాక్యుమెంట్ నెం. 504/2016 బ్యాంక్ లోన్ నిమిత్తం అప్పనవీడు నుంచి బాపులపాడు వెళ్ళుచుండగా మార్గంమధ్యలో పోయినది. దొరికిన వారు క్రింది తెలిపిన నెంబర్‌ను సంప్రదించి అందజేయగలరు.

✆ 98485 23673.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పెనమలూరు డివిజన్

✆ 90105 77706 (ఉయ్యూరు)
99122 20539 (పెనమలూరు)
90102 10382 (గన్నవరం)

Office mail : sakshiads@gmail.com